క్లుప్తంగా

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



తెనాలిఅర్బన్: దంతాల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దంత వైద్యనిపుణురాలు డాక్టర్ ఓగిరాల హిమబిందు సూచించారు. రక్షణ సైన్యం సంస్థ ఆధ్వర్యంలో అయితానగర్‌లోని చర్చి వద్ద ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే నోటి దుర్వాసన రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఆమె దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇచ్చారు. చర్చి పాస్టర్ మేజర్ నాగరాజు, రత్న సుందరి, సంఘ పెద్దలు గాలి రవి కుమార్, పిల్లి కనకరత్న, కారుమంచి నరసింహరావు, ఎ.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బహుజన హితమే బీటీఏ లక్ష్యం

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్



తెనాలి: బహుజన హితమే బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం బీటీఏ ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశానికి రాష్ట్రకార్యదర్శి బట్టు వెంకయ్య అధ్యక్షత వహించారు. చిట్టేటి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జీఓ నెం.117ను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.మధుసూదన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషపై శిక్షణ ఇవ్వాలని కోరారు. బీటీఏ రాష్ట్ర, జిల్లా నాయకులు జి.వేమయ్య, సీహెచ్ కిషోర్‌బాబు, దాసరి ప్రసాద్, కె.హీరమ్స్, సీహెచ్ పూర్ణ, బి.సువర్ణరాజు పాల్గొన్నారు.

తల తిరుగుటకు, చెవి సమస్యలకు సంబంధం ఉంది

వాకర్స్ క్లబ్ సమావేశంలో డాక్టర్ సీహెచ్ భానుప్రసాద్



తెనాలి: వృద్ధుల్లో చెవి సమస్యల కారణంగానూ తల తిరగటం జరగవచ్చని ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణుడు డాక్టర్ సీహెచ్ భానుప్రసాద్ చెప్పారు. వాకర్స్ క్లబ్ తెనాలి జూలై నెల సమావేశం ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకట రత్నం అధ్యక్షత వహించారు. 'తల తిరుగుట–చెవిలో మోత–వినికిడి లోపం' అనే అంశంపై డాక్టర్ భానుప్రసాద్ ప్రసంగించారు. తల తిరుగుటకు చెవికి గల సంబంధాన్ని వివరించారు. తల తిరగటానికి కొన్ని పెద్ద కారణాలు, ఒక్కో సందర్భంలో చిన్న కారణం ఉండొచ్చని చెప్పారు. ప్రమాదం, నరాల సంబంధిత అంశాల కారణంగానూ, చెవిలో చీము చేరటం వల్ల ఎక్కువగా ఉండొచ్చని చెప్పారు. మొదట చెవిలో చీము చేరి, తర్వాత మోతకు దారి తీస్తుందని, క్రమంగా వినికిడి లోపం ఏర్పడుతుందని చెప్పారు. తల తిరుగుటను యోగతో నివారించవచ్చని చెప్పారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో మొవ్వా సత్యనారాయణ, అబ్బయ్య, ప్రసాద్, నరేంద్ర, ఆనందయ్య, నర్సయ్య, రత్తయ్య, బొబ్బా వెంకటేశ్వరరావు, మురళి, అశోక్ పాల్గొన్నారు. ప్రసంగం అనంతరం డాక్టర్ భానుప్రసాద్‌ను సత్కరించారు.

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్‌లు

నగరంపాలెం: లయన్స్ క్లబ్‌లు సేవలకు ప్రతిరూపమని క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 316 హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ అన్నారు. జేకేసీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా లయన్స్ క్లబ్స్ మొదటి కార్యవర్గ సమావేశం, క్లబల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథి ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా చీఫ్ అడ్వైజర్ నూతలపాటి వీరప్రకాష్‌రావు మాట్లాడుతూ 2024–25లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, నిరోధక సేవా కార్యక్రమాల నిర్వర్తించి, 316 హెచ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వివి సుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ సిహెచ్ చక్రపాణి, మాజీ గవర్నర్ కృపానందం, ఎంసీసీ శ్రీనివాసరావు, జోనల్, జిల్లాల చైర్మన్లు, సమన్వయకర్తలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- సాయినాథునికి ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



బోసురోడ్డులోని సాయిబాబా మందిరంలో పూజలు



బీసీ కాలనీలోని ప్రధాన సాయిబాబా మందిరంలో సాయినాథుడు



నందివెలుగులోని సాయిబాబా మందిరంలో పెద్దసంఖ్యలో భక్తులు

తెనాలి: గురుపౌర్ణమి వేడుకను పట్టణ, పరిసరాల్లో భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. గంగానమ్మపేటలోని పర్వతవర్ధినీ సమేత రామేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో గల అష్టభుజ దుర్గాదేవి అమ్మవారికి ఇదే అలంకరణ చేశారు. అలంకరణ విశిష్టతను ఆలయ అర్చకుడు పొత్తూరి వెంకటసురేష్ తెలిపారు. శ్రీ రామేశ్వర స్వామికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో రమణ కుమారి, పెనుమూడి వెంకటసుబ్బారావు, పెనుమూడి పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- స్థానిక ఐతానగర్‌లోని శ్రీ షిరిడీ సాయి మందిరంలో 21వ గురు పౌర్ణమి మహోత్సవాలను వైభవంగా జరిపారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, కాగడ హారతి నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. 108 కలశాల గంగాజలంతో అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాబా వారిని దర్శించుకున్నారు. ఉదయం 11.30 గంటలకు బాబా వారి శేష వస్త్రాల వేలం నిర్వహించారు. మధ్యాహ్నం నుండి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీ షిరిడీ సాయి మందిర కమిటీ సభ్యులు ఉత్సవాలను పర్యవేక్షించారు.
- పట్టణ సుల్తానాబాద్‌లోని ఆలపాటినగర్‌లోని సద్గురు సాయికుమార్ మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున కాగడ హారతితో పూజలను ఆరంభించారు. అనంతరం సాయిబాబాకు శ్రీమహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను భక్తులచే చేయించారు. సాయిబాబాకు విశేష అలంకరణలు చేశారు. అర్చకులు ములుగుట్ల రఘునాథ్ శాస్త్రి, నోరి రామకృష్ణ బాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీ షిరిడీసాయి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంపటి సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తిరంజని వీనులవిందు చేసింది. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. చెంచుపేట, పాండురంగ పేట, అమరావతి కాలనీ, సుల్తానాబాద్, అంగలకుదురు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వచ్చి బాబా వారిని దర్శించుకున్నారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులతో సహా బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయికుమార్ మందిరం భక్త బందం తరపున తాళ్లూరి సాంబయ్య, నాగళ్ల మోహన్ కుమార్, మేలేటి ఉషారాణి ఉత్సవాలను పర్యవేక్షించారు.
- స్వరాజ్ టాకీస్ సెంటర్ బోసురోడ్‌లోని దక్షిణ పథంలోనే ప్రథమ మందిరమైన సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ షిరిడి సాయిబాబా మందిర సేవాసమితి ఆధ్వర్యంలో హారతి, పూజలు, అభిషస్తకాలు, బాబా నామం భజనలు చేశారు. పలువురు ప్రముఖులు బాబా వారిని దర్శించుకుని పూజలు జరిపారు. మధ్యాహ్న ఆరతి అనంతరం అన్నదాన వితరణ చేశారు.
- నాజరుపేటలోని పుట్టా రాఘవయ్య రైస్‌మిల్ దగ్గర, శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ధుని పూజా ద్రవ్యాలతో ప్రదర్శనగా స్వరాజ్ టాకీస్ సెంటర్లోని సాయిబాబా మందిరానికి చేరుకుని అక్కడ వాటిని సమర్పించారు. అనంతరం ప్రదర్శనగా నాజరుపేటలోని షిరిడీ సాయిబాబా సమాధి మందిరానికి చేరుకుని ధునిలో ద్రవ్యాలు వేశారు. ఆలయ కమిటి సభ్యులు డాక్టర్ జె విజయలక్ష్మి, పి రామమోహన రావు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన గుంటూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.
- నందులపేటలోని శ్రీ షిర్డిసాయి అనుగ్రహ పీఠంలో గురుపౌర్ణమి నిర్వహించారు. కాకడ హారతి, అభిషేకాలు, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. భజనలు చేశారు. అన్న ప్రసాద వితరణ చేశారు. కమిటీ సభ్యులు నాగమల్లేశ్వరరావు, యశోద, ప్రతాప్, ఆనందలక్ష్మి, భవానీ ప్రసాద్, గీత పర్యవేక్షించారు.
- మారీసుపేట శివాలయం పక్కనే ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఈనెల 15వ తేదీనుంచి ఏడురోజుల సప్తాహ మహోత్సవాలను నిర్వహించారు. గురుపౌర్ణమి రోజున కాకడ హారతితో ప్రారంభించి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పుష్పార్చన నిర్వహించారు. మందిర అర్చకులు జంధ్యాల రఘురామ శర్మ పూజలను చేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సాయిబాబాను దర్శించుకున్నారు. అన్న సమారాధనను ప్రారంభించారు.ఆలయ కమిటీ అధ్యక్షులు సీదా రామకృష్ణ పర్యవేక్షించారు.
- బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో గల సాయిబాబా ప్రధాన దేవాలయంలో శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషస్తకాలు చేశారు. సాయినామ సంకీర్తన చేశారు. హారతి అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ కె లక్ష్మణ బాబు పర్యవేక్షించారు.
- మారీసుపేట పాత బస్టాండ్ సమీపంలోని శ్రీదత్త సాయి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబా మందిరం వద్ద కరెన్సీతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం హారతి, అఖండ నామ సంకీర్తనలో రాజస్థానీ భజన మేళ తాళాలతో 108 పల్లకీ ప్రదక్షిణలు జరిగాయి. కమిటీ చైర్మన్, అనువంశిక ధర్మకర్త రేటూరి నాగసాయి, సీహెచ్ సతీష్ కుమార్, టి.వెంకట రమణ, ఎ.తిరుపతమ్మ, యం.సత్య కుమారి, ఆర్.శ్రీ రమ్య, ఆర్ .దత్త శేష సాయి, పద్మజ, గ్యాలం వేణు పర్యవేక్షించారు.
- మారీసుపేటలోని శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శ్రీబాలాత్రిపురసుందరి దేవి గురుపౌర్ణమి రోజున శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందివెలుగులో...

రూరల్ మండల గ్రామం నందివెలుగులోని శ్రీ సాయిక్షేత్రంలో గురుపౌర్ణమి రోజున విశేష పూజలు, అన్నదానం,పల్లకి ఉత్సవం, భజన, సంకీర్తనను వైభవంగా నిర్వహించారు. శ్రీ షిరిడీ సాయి స్వచ్ఛ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులతో మందిరం కిటకిటలాడింది. ట్రస్ట్ చైర్మన్ ఎంపీ హరిప్రసాద్‌రావు, ట్రస్టీలు సుకుమార్, రాజా, శ్రీవల్లి, శ్రీసాయి క్షేత్రం కార్యవర్గ సభ్యులు పార్వతి, సాయి కష్ణ, ఫణికృష్ణ పర్యవేక్షించారు.

సత్యసాయి సేవాసమితిచే గురుపౌర్ణమి..

తెనాలి: పట్టణ నాజరుపేటకు చెందిన శ్రీసత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన చేశారు. అనంతరం స్వామికి అభిషేకం, విశేష అలంకరణ, సహస్రనామ అర్చన, భజన తదుపరి మంగళ హారతి చేశారు. మధ్యాహ్నం మహా అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం పల్లకి ఉత్సవాన్ని పురవీధుల్లో నిర్వహించారు. సేవాసమితి కన్వీనర్ టి.తిలక్, సభ్యులు ఆదిన పద్మావతి, ప్రసాద్, గోపాలకృషణ, వెంకట్రావు, రామకృష్ణ, వి.సుబ్బారావు, మురారి, ఎం.కేశవరావు, అంకేశ్వరరావు, నటరాజకుమారి, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

పేద వృద్ధులకు పెన్షన్ల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ – ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆగస్టు 20న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. ఆదివారం అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ అతిథిగా పాల్గొన్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతి నెల 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు ఇవ్వడతో పాటు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఔషధాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సివిల్స్ శిక్షణ పొందే విద్యార్థులకు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి పూజలు నిర్వహించారు. డాక్టర్ వైదేహి గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తామని నగర అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

సద్గురు సుబ్రహ్మణ్యానందనాథకు సత్కారం



సత్కారం అనంతరం స్మర్ణగామి గ్రంథ ఆవిష్కరణ చేస్తున్న సద్గురు సుబ్రహ్మణ్యానందనాథ గురువు



లీలావతిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



భాగవతుల ఆంజనేయశర్మకు సత్కారం



కిషోర్ గురూజీని సత్కరించిన వివిధ శాఖల బాధ్యులు

తెనాలి: గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక నాజరుపేటలోని కల్యాణ మంటపంలో ఆదివారం జరిగిన సభలో సద్గురు సుబ్రహ్మణ్యానందనాథ గురువును వారి శిష్యులు ఘనంగా సత్కరించారు. పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. చందనోత్సవం, ఊరేగింపు, గోపూజ, గురుపాద పూజ, పుష్పాభిషేకం, వీణానాద కచేరీ, సత్సంగం, గురు వందనం తదితర వేడుకలను వైభవంగా జరిపించారు. తొలుత చందనోత్సవంలో సన్నాయి మేళం, గోవులు, టపాసుల కోలాహలంతో భక్తులు, శిష్యుల నడుమ సద్గురు నినాదాలతో ఊరేగింపుగా వేదికకు తీసుకువచ్చారు. అందరికీ సద్గురువులు చందన ప్రసాదం చల్లి అనుగ్రహిస్తూ సాగారు. జాజి, సంపెంగ, గులాబి లాంటి వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో పుష్పాభిషేకాన్ని ఆహ్లాదంగా చేశారు. ప్రముఖ వీణా విద్వాంసురాలు పుచ్చా కనకదుర్గ పలు త్యాగరాయ, పురందర దాసు ఇతర శాస్త్రీయ కీర్తనలను తమ వీణపై ఎంతో మధురంగా మీటారు. కె.రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు.

- ఈ వేడుకల్లో భాగంగా 'స్మర్ణగామి' అనే ఆధ్యాత్మిక గ్రంథ ఐదవ ముద్రణ పుస్తకావిష్కరణ చేశారు. ఈ గ్రంథం విశిష్టత, సద్గురువుల మహోత్యంపై పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. వీరిలో సోమయాజులు నాగేశ్వరరావు, పిల్లలమర్రి లక్ష్మీ కాంతం తదితరులు మాట్లాడారు.

లీలావతికి సన్మానం

తెనాలిఅర్బన్: గురు పూర్ణిమ సందర్భంగా మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు నాలుగు సంవత్సరాల క్రితం వారికి విద్యను అందించిన పెదరావూరుకు చెందిన దివంగత పాలడుగు బసవపున్నయ్య ఇంటికి ఆదివారం వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కలసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మధుర స్మృతులు నెమరవేసుకున్నారు. అనంతరం ఆయన సతీమణి పాలడుగు నీలావతిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తన్నీరు శివశంకర్, కాసరనేని శ్రీనివాసరావు, చుక్కా భాను ప్రసాద్, కేకే శ్రీను, ఎన్ఆర్‌కే శర్మ, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం ధ్యానమండలి ఆధ్వర్యంలో..

తెనాలి: శ్రీఆంజనేయం ధ్యాన యోగమండలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మారీసుపేట శ్రీచంద్రమౌళి కల్యాణమండపంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. యోగమండలి తెనాలి, మంగళగిరి, గుంటూరు, బాపట్ల, రేపల్లె, పొన్నూరు, చిలకలూరి పేట, అంగలకుదురు, సోమసుందరపాలెం శాఖల శిష్యబృందం పాల్గొని గురువు కిషోర్ గురూజీని ఘనంగా సత్కరించారు. సభ్యులంతా గురువుకు పాదపూజ చేసి గజమాలతో సన్మానించారు. కిషోర్ గురూజీ స్వయంగా వివిధ గ్రామాల్నుంచి వచ్చిన 50 మంది యోగ గురువులను సత్కరించారు. స్వర్గీయ డాక్టర్ సత్య లక్ష్మి జ్ఞాపకార్థం ఉత్తమ నర్సింగ్ అవార్డు కింద రూ.6 వేలను నర్సులు కుమారి, సుధారాణి, నాగమణికి అందజేశారు. కోడూరి ఆంజనేయులు జ్ఞాపకార్థం ఉత్తమ గుమస్తా అవార్డు కింద రూ.10,232లను తవ్వ జ్యోతి, గోళ్ల రత్నకుమార్‌కు బహూకరించారు. రాజారెడ్డి, శోభనాద్రి, హరనాథ్, చింతలూరు నాగేశ్వరరావు స్వామీజీలు 200 మందికి అన్న ప్రసాదం అందజేశారు. తెనాలి జిల్లా కోర్టు జ్యూడీషియరీ యోగా శిబిరం సభ్యులు తెనాలి 2వ సివిల్ జడ్జి రాజశేఖర్, బార్ అసోసియేషన్ బేతాళ ప్రభాకర్, తాడికొండ శ్రీనివాసరావు స్వామి, నాగరాజు స్వామి, కోమల మాతాజీ, సతీష్ కుమార్ స్వామీజీ, ముంత శ్రీనివాసరావు స్వామీజీ, శోభనాద్రి స్వామీజీ, రాంబాబు స్వామీజీ, ఇస్మాయిల్ స్వామీజీ, వేమ శివ స్వామీజీ, వీరయ్య స్వామీ, తల్లం సుబ్బారావు స్వామీజీ, సూర్యనారాయణ స్వామి, రాణి మాతాజీ, చంద్రిక మాతాజీ, శివరామకృష్ణ స్వామీజీ సుజశ్రీ మాతాజీ, నారాయణ స్వామీజీ పాల్గొన్నారు. కమిటీ కన్వీనర్ తాడికొండ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అద్వైత పండిత్ భాగవతుల ఆంజనేయశర్మకు సత్కారం..

తెనాలి: పట్టణ కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని నిర్వహించారు. దేశంలోనే ప్రామాణికమైన శాస్త్ర పరీక్షలను నిర్వహిస్తూ, 'తెనాలి పరీక్ష'తో ఎందరో శాస్త్ర పండితులను తీర్చిదిద్దుతున్న అద్వైత పండితుడు భాగవతుల ఆంజనేయశర్మకు గురుసత్కారం చేశారు. సభ్యులంతా పాదాభివందనం చేసి, నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించారు. సత్కారగ్రహీత ఆంజనేయశర్మ వ్యాస పౌర్ణమి విశిష్టతను వివరించారు. పరిషత్ నూతన అధ్యక్షుడు కోటా పార్థసారథి, కార్యదర్శి చింతపల్లి సాయికిరణ్, గౌరవ సలహాదారు మాచిరాజు రామకృష్ణ, కోశాధికారి కామరాజుగడ్డ రామచంద్ర మూర్తి, ఉపాధ్యక్షుడు కాజా శ్రీనివాస్, పులిపాక లక్షణకుమార్, నేతి ఆంజనేయ శాస్త్రి, పీవీ దనుంజయ్, ఎం శ్రీనివాస్, గడియారం శివకుమార్, మన్నవ మురళి, మోదుకూరు వేణుగోపాల్, ద్వైత సోమయ్య శాస్త్రి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ ప్రధానాచార్యులతో పూర్వవిద్యార్థులు

తెనాలి: బాపట్ల జిల్లా అమృతలూరు మండల గ్రామం పెదపూడిలోని చదలవాడ కుటుంబరాయలు జిల్లా పరిషత్ ఐటీఐలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1986–91 వరకు అక్కడి ఐటీఐలో చదివిన విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ ప్రధానాచార్యులు మేకల శేషగిరిని సత్కరించారు. తమ బాల్యస్నేహితుల క్షేమ సమాచారాలను పరస్పరం తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలతో ఉల్లాసంగా గడిపారు. చిరునామాలు మార్చుకుని ఏటా కలుసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని నిర్ణయించారు. శిథిలావస్థకు చేరిన తమ విద్యాలయం దుస్థితికి విచారించారు. మళ్లీ విద్యార్థులతో కళకళలాడాలన్న ఆకాంక్షను వ్యక్తంచేస్తూ వీడ్కోలు తీసుకున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: పెళ్లి చేసుకుంటానని మహిళను నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేటకు చెందిన ఓ మహిళ, అంకిరెడ్డిపాలెంకు చెందిన ఓర్సు శివకృష్ణ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనక మహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం



తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలో కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 31వ శాఖను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ ఖాతాదారులకు అనుగుణంగా సత్వర సేవలను అందించేందుకు తమ కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకు ముందంజలో ఉంటుందని చెప్పారు. బ్యాంకు డైరెక్టరు సి.పి. రామారావు, సీఈఓ కె.శ్యామ్‌కిషోర్, శాఖ మేనేజరు బొప్పన వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని బ్యాంకు లాకర్లను ప్రారంభించారు.

మహిళలను దూషించిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇస్తామని పిలిచి స్పష్టమైన సమాధానం చెప్పకపోగా, మహిళలను అసభ్యకరంగా దూషించిన ఇద్దరిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నూరు రోడ్డులోని పంచవటి అపార్టుమెంట్‌లోని ఓ ప్లాట్‌లో షేక్ అఫీస్, షేక్ ఆరీఫ్ బెటర్‌మెంట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఓ సంస్థ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రకటన ఇచ్చారు. ఫోన్‌లో సంప్రదించిన పలువురు ఆదివారం పొన్నూరు రోడ్డులోని సంస్థ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగం విషయంలో స్పష్టత ఇవ్వకుండా పొంతనలేని సమాధానం ఇచ్చారు. ఇదేమని ప్రశ్నించిన వారిని దుర్భాషలాడారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అఫీస్, ఆరీఫ్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమీకృత వసతి గృహ నిర్మాణం పూర్తి చేయాలి

లక్ష్మీపురం: స్థానిక బి.ఆర్.స్టేడియం సమీపంలో ఉన్న కోడిగుడ్ల సత్రంలో నిర్మిస్తున్న సమీకృత సంక్షేమ భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ వసతి గృహ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా ఏఐఎస్ఎఫ్ నాయకత్వం ఆందోళన కార్యక్రమాల రూపంలో, వినతి పత్రాల రూపా ల్లో సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా కూడా వారు కనీసం పట్టించుకోలేదన్నారు. మరోపక్క గుంటూరు నగరంలో బీసీ హాస్టల్‌కు కనీసం ఒక్క శాశ్వత భవనం కూడా లేదన్నారు. నాలుగు జిల్లాల నుంచి చదువుకోవడానికి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ సంక్షేమ భవన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నగర కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, కిరణ్, గణేష్, బన్నీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.